డబ్బుకోసం పాకులాడిన వాళ్ళకి తెలిసిన నగ్న సత్యం?

# సంతృప్తి

యర్రగుంట్ల సూర్యమూర్తి కథ

పరంధామయ్య ప్రొద్దున్నే కాలకృత్యాలు ముగించుకుని, సంధ్యావందన మనంతరం పూజచేసుకుని లేచి వెళ్ళి వాలుకుర్చీలో కూర్చున్నాడు. అతని భార్య అందించిన గ్లాసుడు వేడి కాఫీని తీసుకొని తాపీగా త్రాగడం మొదలెట్టేడు.

మధురగాయని సుబ్బలక్ష్మి పాడిన ఆదిశంకరుల భజగోవింద శ్లోకాలు ఎదురింటి వారి రేడియోకార్డరు నుండి చక్కగా వినవస్తుంటే వింటూ పరంధామయ్య పులికించేడు.

"మూఢ జహీహిధ నాగమ తృష్ణాం
కురు సద్బుద్ధిం మనసి వితృష్ణామ్
యల్లభస్ నిజ కర్మోపాత్తం
విత్తం తేన వినోదయ చిత్తమ్"


ఆహా! శంకరాచార్యులవారు ఎంతచక్కని భావాన్ని విశదీకరించేరు— అనుకున్నాడు.

"ఓ మూఢుడా! ధన దాహాన్ని వదలిపెట్టు. మనస్సును కోరికల్లేకుండా చేసుకొని మంచి బుద్ధివైపు మరల్చు. నీకర్మానుసారంగా ఏది లభిస్తుందో, ఆధనంతోనే నీ మనస్సును సంతృప్తి పరచుకో"

పరంధామయ్యా కర్మబద్ధుడే!

పరంధామయ్య ఆ ఊరి మున్సిపల్ హైస్కూల్లో టీచరుగా పనిచేసి ఆ ముందటి సంవత్సరమే రిటైరయి పింఛను పుచ్చుకుంటున్నాడు. అతనికి ఇద్దరు కొడుకులు, ఇద్దరు కుమార్తెలు.

పెద్ద కుమార్తెను రాయపూరులో వుంటున్న ఓ రైల్వే ఉద్యోగికిచ్చి పెళ్ళి చేసేడు. రెండవ కుమార్తె పెళ్ళికుంది. కొడుకులిద్దరూ బాగానే చదువుకొని ప్రయోజకుల




య్యారు. పెద్దవాడు శంకరరావు విజామాబాద్‌లో బ్యాంకులో క్లర్కుగా పనిచేస్తున్నాడు. బ్యాంకు పరీక్షలన్నీ పాసయ్యాడు. బాగానే జీతం తెచ్చుకుంటున్నాడు. అతనికి వివాహమైంది. ఇద్దరు సంతానం.

ఇక రెండోవాడు శివశర్మ మెకానికల్ ఇంజనీరింగులో డిప్లొమాను పొంది విజయవాడలోని ఓ సిమెంటు ఫ్యాక్టరీలో సూపర్‌వై

జర్‌గా పనిచేస్తున్నాడు. మంచి జీతమే వస్తుంది. అతనికి భార్య, ముగ్గురు పిల్లలువున్నారు.

పరంధామయ్య కొడుకులిద్దరికి తెలిసిన సంబంధాలే— మంచి, మర్యాద కుటుంబ గౌరవం చూసి చేసేడు. కోడళ్ళు రూపురేఖలతోబాటు వినయ విధేయతలు, బంధుప్రీతి కల్గినవారే. పరంధామయ్యంటే ఆ కుటుంబ సభ్యులందరికీ చాలా గౌరవం, ప్రేమాభిమానాలు.

అతను ఆఖరి పిల్లకు వివాహం చేసేస్తే, ఆ మిగిలిన బాధ్యత తీరిపోతుంది. రిటైరైన తరువాత వచ్చిన డబ్బుంది. దాని గురించి చింతలేదు. తనూ, తన కొడుకులూ యోగ్యుడైన వరుడి కోసం చూస్తున్నారు. ఆ సంవత్సరం కాకపోతే, ఆ మరుసటి సంవత్సరం చెయ్యొచ్చు. పెద్దగా ఆందోళన చెందాల్సిన అవసరంలేదు. ఆ అమ్మాయి సుశీల వయస్సు ఇరవై సంవత్సరాలే. పరంధామయ్య జీవితం హాయిగానే సాగిపోతోంది.

ఆ సంవత్సరం సంక్రాంతి పండుగకు కొడుకులూ, కోడళ్ళూ, పెద్దకూతురూ, అల్లుడూ తమ తమ పిల్లల్ని తీసుకొనివచ్చేరు

ఇల్లంతా చాలా సందడిగా వుంది. పరంధామయ్యకు, అతని భార్యకు చాలా ఆనందంగా వుంది. ఉన్నదాంట్లోనే చాలా తృప్తితో బతుకుతున్నారు. వారి సుఖసంతోషాలకు కొదువలేదు.

''నాన్నగారూ! ఈ సంవత్సరం దసరాతో మీ వయస్సు 60 ఏళ్ళు అవుతుందనుకొంటా'' అన్నాడు పెద్దకొడుకు శంకరం.

''అవునురా— నేను అక్టోబర్ 15న పుట్టేను. ఏం?''

''మేమంతా మీకు ఘనంగా మీ షష్టిపూర్తి ఉత్సవాన్ని జరిపిస్తాం''

''అవును మామగారు! దసరా పండుగ రోజులు ఆఫీసులకు శలవు. మేమంతా వచ్చి దిగ్విజయంగా మీ షష్టి పూర్తిని చేయిస్తాం'' అన్నాడు అల్లుడు జగన్నాథం.

''అత్తగార్ని, మామగార్ని పక్కపక్కన కూర్చోబెట్టి షష్టిపూర్తినాడు అన్ని వేడుకలూ చేస్తాం. మీరు కాదనకూడదు. మా సంతోషంలో మీరూ భాగస్వాములు కావాలి'' అని ఆదరంతో అన్నారు కోడళ్ళు.

కూతుర్లిద్దరూ సంతోషంతో అన్ని ఏర్పాట్లను చేస్తామన్నారు.

''ఈలోగా మన సుశీలకు ఓ మంచి వరుడ్ని చూసి ముడిపెట్టేయించండి. ఆ అల్లుణ్ని కూడా పిలవ్వచ్చు'' అన్నాడు పెద్దల్లుడు.

పరంధామయ్య పండుమీసాల వెనుక సన్నగా నవ్వుతూ—

''నేనేం రాజునా రెడ్డినా, నా కెందుకయ్యా ఈ షష్టిపూర్తి వేడుక? మీ అందరి ప్రేమాభిమానాలే నాకు చాలు'' అని తన వారందరికి తన మీదున్న ప్రేమకు ఉప్పొంగిపోయేడు.

సంక్రాంతి పండుగ అయిపోయింది. మరో రెండురోజులుండి వచ్చిన అప్తులంతా వారి వారి ఊర్లకు వెళ్ళిపోయేరు.

ఓనాడు పరంధామయ్య అలా బజారువెంట పోతుంటే ఓ లాటరీ కుర్రాడు అటకాయించేడు.

''మేష్టరుగారూ! మీరు ఓ లాటరీ

టిక్కెట్టును నా దగ్గరకొనాలి. నేను మీ మాజీ విద్యార్థిని''

''అయితే బాగా చదువుకొని ఏ మంచి ఉద్యోగమైనా చేసుకోకుండా ఈ లాటరీ టికెట్లను అమ్ముకోటమేమి?'' అన్నాడు పరంధామయ్య కాస్త చికాకును వ్యక్తపరుస్తూ.

''మరేం చెయ్యను సార్— చదువు బాగా అబ్బలేదు. ఏదో వృత్తి. ఒక టిక్కెట్టును కొనండి సార్. కర్నాటక బంపర్ లాటరీ. బంపర్ బహుమతి పదిలక్షలు. టిక్కెట్టు అయిదురూపాయలు మాత్రమే''

జలగలా పట్టుకున్నాడు ఆ కుర్రాడు. ఆఖరికి వాడిని వదిలించుకోడానికి పరంధామయ్య ఓ లాటరీ టిక్కెట్టును కొనక తప్పలేదు. తరువాత పరంధామయ్య ఆ టిక్కెట్టు సంగతే మరచిపోయేడు.

ఓ వెల్లాళ్ళ తరువాత హఠాత్తుగా ఓనాడు ఆ లాటరీ కుర్రాడు పరుగెత్తుకుని వచ్చేడు పరంధామయ్య ఇంటికి.

''మేష్టరుగారూ! మీ అదృష్టం పండింది. మీకు కర్నాటక లాటరీ బంపరు పదిలక్షల బహుమతి వచ్చింది. ఇదిగో చూడండి సార్ నంబర్ జెకె–501647. మీటిక్కెట్టు కౌంటర్ ఫాయిల్ మీద మీపేరు, అడ్రసు రాసుకున్నాగా'' అని తన దగ్గరున్న రిజల్టు పేపరును చూపేడు.

పరంధామయ్య ఆ లాటరీ టిక్కెట్టును ఎక్కడ పెట్టేడో మరచిపోయేడు. సంభ్రమాశ్చర్యాలతో పరంధామయ్య, భార్య, కూతురు ఆ టిక్కెట్టు కోసం వెదకనారంభించేరు. ఓ అర్థగంట తరువాత ఆట టిక్కెట్టు బీరువాలో అతని పంచల మధ్యన దొరికింది. శ్రద్ధగా దానిలోని నంబరును రిజల్టు పేపరుతో సరిచూసుకున్నాడు. అనుమానంలేదు— పరంధామయ్య బంపరు బహుమతి గెల్చుకున్న టిక్కెట్టునే కొన్నాడు.

ఆ లాటరీ కుర్రాన్ని ఆ డబ్బునెలా పొందాలని పరంధామయ్య భార్య అడిగింది.

''ఏముందండి— వెంటనే టిక్కెట్టు

## బిజూ ప్రత్యేకత!



ఒరిస్సా ముఖ్యమంత్రి బిజూపట్నాయక్ గారు ఏంచేసినా ... ఎంతో కొంత ప్రత్యేకత ఉంటుంది! ఆయన తీసికొన్న తాజా నిర్ణయం ప్రకారం ఒరిస్సాలోని లేడీ ఆటో డ్రైవర్లు ఇకనుంచి రౌడీ ప్రయోగీకులనుంచి ఆత్మరక్షణ కోసం వీరు తమవద్ద కత్తుల్ని ఉంచుకోవచ్చునట! అంతే కాదండోయ్! ఒకవేళ లేడీ ఆటోడ్రైవర్లు ఎవర్నైనా పొడిస్తే, దెబ్బ తగిలిన రౌడీల్ని వెంటనే అరెస్ట్ చేయాలని కూడా పట్నాయక్‌గారు ఆదేశించారట! అక్కడితో అయిపోలేదు — ఆ లేడీ ఆటో డ్రైవర్లమీద కేసు కూడా ఉండదట బాగుంది కదూ!!

—జూపిటర్

పెమక మేష్టరుగారు సంతకం చేసి భద్రంగా ఆ టిక్కెట్టునుంచాలి. ఆ లాటరీ డైరెక్టరు కు బెంగుళూరుకు మీరు లాటరీలో బంపర్ బహుమతి గెల్చుకున్నారని ఆ లాటరీ టిక్కెట్టు మీవద్ద ఉన్నదని తెలియజేస్తూ ఈనాడే రాసిపడేయండి. వారు వచ్చిన క్లైయిమ్స్ అన్నీ పరిశీలించాక మీ టిక్కెట్టు ను తీసుకుని బెంగుళూరు రమ్మని మీకో ఉత్తరం రాస్తారు. అక్కడ మీ టిక్కెట్టును తీసుకొని మీపేరున 10 లక్షల రూపాయల కు ఓ చెక్కునిస్తారు అంతే! అది తీసుకొని వచ్చేయడమే! బహుమతి పొందిన మీ టిక్కెట్టును అమ్మినందుకు నాకు ఓ పదివేల రూపాయల్ని బహుమతిగా ఇస్తారు. మీరు రమ్మంటే మీతో నేను వస్తాను.

"అలాగే బాబూ! తప్పకుండా నాతోవ ద్దువుగాని" అన్నాక ఆ లాటరీ కుర్రాడు పోయేడు.

పరంధామయ్య ఆ లాటరీ టిక్కెట్టును కళ్ళకద్దుకుని భద్రంగా తన బీరువాలో దాచేడు.

అతని భార్య కామేశ్వరమ్మ ఆ సంతోషా న్ని పట్టలేక తన వాళ్ళతో పంచుకుందామని కొడుకులకు, కూతురుకు ఉత్తరాలు రాసిపడే సింది.

అంతే ఓ వారం రోజులకు అందరూ వచ్చివాలేరు. అందరి ముఖాల్లో ఓవింత కాంతి, వికసించిన ఆనందరేఖలు! అందరూ పరంధామయ్య అదృష్టాన్నీ, అతను ముందు చూపుతో కొన్న లాటరీ టిక్కెట్టు గురించి, ఆనాడు చెప్పిందే చెప్పుకుని ఆహ్లాదంగా గడిపేరు. కాని వింతేమిటంటే పరంధామ య్యకు అంతగా ఆనందంగాలేదు. ఏదో అసంతృప్తి చిగురేసింది.

తన పిత్రార్జితమైన ఆ పెంకుటింట్లో తను సర్వీసులో వున్నప్పుడు బాగా మరమ్మ త్తులు చేయించుకుని కుటుంబంతో నివసిస్తు న్నాడు. ఆ ఇంట్లోనే పిల్లాపాపా కల్గేరు. సంతానమంతా పెరిగి పెద్దవారయ్యారు. పెళ్ళిళ్ళు, పురుళ్ళు, పుణ్యావాచకాలు, ఒక టేమిటి అన్ని శుభకార్యాలూ ఆ ఇంట్లోనే జరిగేయి. అట్లాంటి ఆ పాత పెంకుటింటి కి, తను రిటైరయ్యాక వచ్చిన ఆ గ్రాట్యుటీ, ప్రావిడెంటు ఫండు మొత్తం నలభైరెం డువేల రూపాయల సొమ్మును పరంధామ య్య ఇచ్చిన విలువ ఆ రాబోయే పదిలక్షలకు ఇవ్వలేకపోతున్నాడు.

వారంతా చేరిన రెండవరోజున మొట్ట మొదట పెద్దకొడుకు, పెద్ద కోడలు వీలు చూసుకొని తండ్రిపైన, తల్లిపైన దాడిచేసే రు.

"నాన్న! మీకు వచ్చే పదిలక్షలతో ఏం చేద్దామనుకుంటున్నారు?"

"అదే నాకు తెలియని విషయమైపోయిం దిరా. అంత డబ్బును నేనేం చేసుకోగలను? నా దగ్గరున్న డబ్బుతో నీ చెల్లెలు పెండ్లయి పోతుంది. నాకూ, మీ అమ్మకూ తలదాచు కునేందుకు ఈ కొంప వుండనే వుంది. మా జీవనోపాధికి నా పెన్షన్ సరిపోతుంది కదా— మరి మాకింకేం కావాలి?" కొడుకు, కోడలు ఆత్యాంతాశతో ఒకరి ముఖాలొకరు చూసుకున్నారు.

"నేనో విషయం చెప్దామనుకుంటున్నా ను నాన్నా. మన సుశీల పెళ్ళి అయిపోగానే

మీరిరువురు మా వద్దకు వచ్చేయండి. ఈ వయస్సులో మీరు విడిగా వుండడం భావ్యం కాదు. ఏ అవసరం కల్గినా మేముంటాం తోడుగా. పైగా మీకు మీ మనవలతో బాగానే కాలక్షేపమౌతుంది— ఏమంటారు?'

"అవును అత్తయ్యా! అన్ని పనులు నేను చూసుకుంటాను. మీరు కాలుకింద పెట్టన వసరముండదు. మీరు మాకు తోడుగా, మేము మీకు తోడుగా వుంటే సంతోషంగా వుంటుంది" అంది పెద్ద కోడలు.


"సరిలేండ్రా— ముందు మన సుశీల పెళ్ళికానీండి, తరువాత ఆలోచిద్దాం" అన్నాడు పరంధామయ్య చిరునవ్వుతో.

"సుశీల పెళ్ళి గురించి మీరు ప్రయాస పడనవసరం లేదు నాన్నా. దానికి బేషైన సంబంధం నేనే చూస్తాను నెల తిరిగేలోగా. అవతలవారు కోరినంత కట్నాన్ని మనం పారేస్తే సరి. మనకిప్పుడు డబ్బుకు కొదువలేదు కదా"

"అవునురా శంకరం! నువ్వు గుర్తుంచుకొని ఆ ప్రయత్నం చెయ్యి" అంది తల్లి ఆశతో. తన భార్య కౌసల్య భావ గర్భితంగా ముఖంలోకి చూసేసరికి, మరి జాగుచేయడం దేనికని శంకరం అసలు విషయం బయటపెట్టేడు.

"నాన్నా! హైదరాబాద్‌లో చిక్కడపల్లి ఏరియాలో హుడావాళ్ళు మంచి ఇళ్ళు కట్టి అమ్ముతున్నారు. నాకు హుడా ఆఫీసులో ఓ స్నేహితుడున్నాడు. కావాలంటే ఓ ఇంటిని ఎలాట్ చేయిస్తానన్నాడు. ఖరీదు మనం కట్టుకున్న దానికంటే తక్కువే అవుతుంది. అంతా కలిపి లక్షా ఎనభైవేలవుతుంది. రోజురోజుకీ ధరలు పెరుగుతున్నాయి. ఈ ప్లాటును కొనుక్కోడం చాలామంచిది. అందుకే మీరు మరోలా భావించక ఆ లాటరీ మొత్తంలో ఓ రెండులక్షలిప్పిస్తే ఓ ఇల్లు కొనుక్కుంటాను"

"అవును మామగారూ! మీరెలాగూ ఆ



డబ్బును తరువాత మీ పిల్లలకివ్వాల్సిందే కదా. అదే ముందుగా ఇస్తే ప్రయోజనమౌతుందని మా ఉద్దేశం''

''అలాగే— డబ్బురానీ, చూద్దాం''

''చూద్దాం అంటే కుదరదు నాన్నా— మీరిస్తానని మాటివ్వాల్సిందే''

కొడుకు, కోడలు ముఖాలలోని కాంక్షను గమనించి, మరే జవాబు చెప్పలేక 'సరే' అన్నాడు పరంధామయ్య.

ఈ మాటలన్నీ ద్వారానికి అటువైపునుండి విన్న సుశీల తరువాత ఆమె చిన్నన్నయ్యతో చెప్పేసింది. ఆమెకు చిన్నన్నయ్య శివశర్మంటే అభిమానమెక్కువ.

అంతే ఆ మధ్యాహ్నమే శివశర్మ, అతని భార్య నళిని అత్తగార్ని మామగార్ని గదిలోకి పిలిచి తలుపులు చేరవేసి తమ దాడిని మొదలెట్టేరు.

''నాన్నా! అన్నయ్యకు హైదరాబాద్‌లో ఇల్లు కొనుక్కునేందుకు రెండులక్షలిస్తున్నారా?''

''అప్పుడే నీకెవరు చెప్పేసేరురా ఈ సంగతి?''

''ఎవరైతేనేం లేండి. చూడండి నాన్నా! అన్నయ్యకు మీరు ఎమ్.ఏ వరకు చదివించేరు.

అంటే స్కూలు ఫైనల్ తరువాత ఏడేండ్లు చదివించేరు. నన్నుమాత్రం స్కూల్ ఫైనల్ తరువాత మరో మూడేళ్ళు చదివించి ఎల్ఎంఇ అయ్యాక ఉద్యోగంలో పడేసేరు. ఈలోనుమేళాలు మొదలయ్యేక బ్యాంకువాళ్ళకు బాగానే వస్తుంది. పైగా ఇల్లు కట్టుకునేందుకైనా, కొనుక్కునేందుకైనా బ్యాంకు యాజమాన్యం కావాల్సినంత అప్పిస్తుంది స్వల్పవడ్డీపైన. ఇంతకీ అన్నయ్యకు ఇద్దరూ కొడుకులే, కూతుర్లు లేరు. అట్లాంటివాడికి రెండులక్షలు కావాల్సి వచ్చాయా? మీరు వెంటనే మాటిచ్చేరు కదా? బాగుంది! మీకెవరి మీద అభిమానముందో తెలుస్తోంది''

పరంధామయ్య మనస్సు చివుక్కుమంది 'పాపిష్టి డబ్బు! అన్యోన్యంగా ఉన్న అన్నదమ్ముల మధ్యన విరోధాన్ని సృష్టిస్తుందే!' అని బాధపడజొచ్చేడు.

''అవును మామగారు! మీరు రిటైరైపోయేరు. మిమ్మల్నిద్దర్నీ మాతో తీసుకొని వెళ్ళి మావద్ద వుంచుకొని అన్ని సపర్యలు చేద్దామని మేము ఉబలాటపడ్తుంటే మీరేమో మీ పెద్దకొడుకు పెద్ద కోడలు వైపు మొగ్గుచూపుతున్నారు. నిజానికి మీ చిన్నబ్బాయి మిమ్మల్ని తలవని రోజులేదు. నిత్యం మేమిద్దరం మీగురించే ఆలోచిస్తుంటాం. మీపై మాకున్న ప్రేమాభిమానాలకు సాటి కావు ఎవరివి'' అంది నళిని.

''శంకరం సంగతి మీకెందుకుగాని మీకు కావాల్సిందేమిటో చెప్పండి'' అన్నాడు పరంధామయ్య చికాకుగా.

శివశర్మ అతని భార్య నళిని విజయగర్వంతో ఒకరి ముఖాల్లోకి ఒకరు చూసుకున్నారు.

''చూడండి న్నా! విజయవాడలోని
సత్యనారాయణపు లో మంచి ఇళ్ళస్థలాల
ను అమ్ముతున్న . ఓ అయిదువందల
గజాల స్థలాన్ని ని మంచి ఇంటిని
కట్టుకోవాలను న్నాను. దాని గురించి

ఓ రెండులక్షలు అవసరమౌతాయి. పైగా నా కర్మకి నా ముగ్గురు సంతానంలో ఇద్దరు ఆడపిల్లలు. వారి పేరున ఇప్పటినుండి డబ్బువేస్తేగాని వారి పెళ్ళిళ్ళు ముందుముందుకు దుర్భరమౌతుంది. అందుకే వారి పేరున చెరో ఏభైవేలు ఫిక్స్‌డ్ డిపాజిట్ చేయదల్చేను. మరి మీరు అన్ని విషయాలను సానుభూతితో పరిశీలించాలి. ఎలాగైనా మీరు ఆ లాటరీ డబ్బులోంచి ఓ మూడులక్షల రూపాయల్ని నాకివ్వాలి'' అని చిన్న కొడుకు శివశర్మ తెల్చేసేదు.


''మీరు కాదనకూడదు మామగారూ! ఈ వ్యవహారమంతా అయిపోయేక మీరిరువురూ మాతో విజయవాడ వచ్చేయండి. మాతోనే వుందురుగాని'' అని చిన్నకోడలు తన వంతు పాడింది. తల్లి కామేశ్వరమ్మకు చిన్న కొడుకు శివశర్మంటే కాస్త ప్రీతి ఎక్కువ.

''మరి ఆలోచించకండి. చిన్నవాడు అడక్క అడక్క అడిగేడు. అలాగే ఇస్తాననండి'' అంది.

పరంధామయ్యకు మరి చెప్పేదేమీ తోచక సరే అన్నాడు.

ఆ సాయంత్రం హాయిగా ఇద్దరు కొడుకులూ భార్యల్ని, పిల్లల్ని తీసుకొని రసవత్తరమైన తెలుగు సినిమా ''దోపిడీ దొంగలు'' చూడడానికి వెళ్ళేరు. ఆ అదను చూసుకొని పెద్ద కూతురు శ్యామల, అల్లుడు జగన్నాథం మెల్లగా చేరేరు పరంధామయ్య ఎద్దకు. అతను కాస్త గాభరా పడ్డాడు ఈ దాడికి.

''నాన్నా! నేనూ మీ బిడ్డనే అన్న సంగతిని మీరు మరచినట్లున్నారు. మీరు మీ చిన్నకొడుక్కి మూడులక్షలిస్తాననడం మీ అల్లుడిగారి చెవిన పడింది. అప్పటినుండి అతను నామీద కారాలు, మిరియాలు నూరుతున్నారు. మరో రెండేళ్ళకు నాకూ తుర్లిద్దరూ పెండ్లికెదిగి కూర్చుంటారు. వాళ్ళకు మంచి సంబంధాలు చూసి చెయ్యాలిగా. ఇన్నాళ్ళూ అతను ఉద్యోగం చేస్తున్నారన్నమాటే గాని ఏం లాభం— తెచ్చిన



## సంపద

మంత్రిగారిని పజిల్‌గా అడిగాడు విలేకర్లు ''సారా నిషేధం గురించి కాలయాపన చేస్తున్నారెందుకు?'

''సారా కొసం తయారైన పోలిథిన్ సంచులు దండగైపోయి జాతీయ సంపదకు నష్టం వస్తుంది కదాని ఆలోచిస్తున్నాం.''

''....!?!

—పి.సునీత (వడ్లమూరు)

జీతంతిండికీ, బట్టకే సరిపోవడంలేదు. తరువాత తలదాచుకోడానికి మా కని కొంపకూడాలేదాయె'' అని వాపోయింది పెద్దకూతురు.

పరంధామయ్యకు కాస్త తిక్కరేగింది. 'అందుచేత?'' అని ప్రశ్నించేడు.

''అందుచేత మాకో మూడులక్షల్ని ఇవ్వమంటున్నాము. మీ కష్టార్జితంలోది ఓ గ్గిగవ్వను కూడా మేము కోరడంలేదు. ఆ లాటరీ సొమ్ములోది ఇవ్వమంటున్నానండి'' అంది గడుసుగా శ్యామల.

''అవును మామగారూ— మీరు నా మంచితనాన్నీ తెలుసుకోవాలి. ఆనాడు పెళ్ళిలో మీరెంత కట్నమిస్తే, ఏ బట్టల్ని పెడ్తే అవే తీసుకున్నాను గానీ మారుమాట్లాడలేదు. పండుగలకు నోరు తెరచి ఇది కావాలని, అది కావాలని మిమ్మల్ని వేధించలేదు. పైగా అత్తామామల్ని నా తల్లిదండ్రులుగా ఇన్నాళ్ళూ భావిస్తూ వచ్చేను. మీరు కూడా అదే దృక్పథంతో నన్ను అల్లుడుగా కాక మీ కొడుకులలో ఒకరిగా పరిగణించి ఓ మూడు లక్షల్ని సహాయం చేయాలి'' అని కోరేడు నేర్పుగా.

పరంధామయ్య కెందుకో బేరమాడాలని వెంకి బుద్ధి కలిగింది.

''అమ్మా శ్యామలా! మీ కోరిక సమంజసమే గాని నేను కొన్ని కారణాల చేత రెండులక్షల కన్నా ఎక్కువ ఇవ్వలేను. మీ ఇష్టం— కావాలంటే ఆ మొత్తం తీసుకోండి లేకుంటే మానేయండి''

''అదేమిటి నాన్నా — అలాగంటే ఎలా చెప్పండి. మా అవసరాలను మీరూ గమనించాలిగా'' అని తన భర్త మెప్పును పొందడానికి గునిసింది శ్యామల.

మామగారి చికాకును గమనించిన అల్లుడు జగన్నాథం తాడును ఇంకా లాగడం మంచిది కాదని— ''మామగారూ! మీకు ఇబ్బంది కల్గించడం మా ఉద్దేశం కాదు. మీరారెండు లక్షల్నే ఇవ్వండి. ఎలాగో సరిపెట్టుకుంటాం'' అన్నాడు.

సరిలెండి అన్నాడు పరంధామయ్య చిరునవ్వుతో.

ఆ మరునాడు మిగిలిన ఆ చిన్న కూతురు సుశీల తండ్రితో గట్టిగా మాట్లాడలేక తల్లి పక్కన చేరి తన గోడును చెప్పుకుంది.

''అమ్మా! చవగ్గా దొరికేరని ఏ పాతిక వేలనో ముఖాన్న కొట్టి ఓ ప్రైవేటు కంపెనీ గుమస్తాను నాకు కట్టబెట్టడానికి ప్రయత్నిస్తే నేనూరుకోను. నాకు ఓ ఆఫీసరో, ఇంజనీరో కావాలి. అమ్మా! అన్నయ్యలకు, అక్కయ్యకు లక్షలిస్తున్నారు కదా— మరి ఓ లక్ష రూపాయలు కట్నం క్రింద ఇస్తామంటే ఏ బ్యాంకు ఆఫీసరో, ఏ ఐఏఎస్ వాడో దొరుకుతాడు కదమ్మా. నాన్నను ప్రయత్నించి అట్లాంటి అల్లుడ్ని తెమ్మను. మంచి సంబంధం కాకపోతే నేనొప్పుకోను'' అని ఏనాడు నోరు విప్పని సుశీల తల్లితో ధైర్యంగా చెప్పి, ఉత్సాహంగా కలలు కనసారంభించింది.

ఆ మరునాడు ఎవరెవరికి తండ్రి ఎంతెంత ఇస్తానన్నాడో ఇంట్లోని వారందరికీ తెలిసిపోయి రామరావణ యుద్ధమైపోయింది.

అన్నదమ్ములిద్దరూ కలిసి అల్లుడికి ఎందుక వ్వాలన్నారు. ఆ తరువాత అన్నదమ్ములిద్దరి మధ్యన పోట్లాట మొదలైంది. తమ్ముడికి మూడులక్షలు తనకి రెండులక్షలు మాత్రమే నా అని శంకరం వాదన.

పరంధామయ్యకు మతిపోతున్నట్లయింది. తలపట్టుకుని కూర్చున్నాడు. ఆ గొడవను భరించలేక ఆఖరికి ఆ తల్లి కామేశ్వరమ్మ కలుగజేసుకుని ఇద్దరు కుమార్తెలను, ఇద్దరు కొడుకులను, ఇంటి యజమానికి అలా అయిదువాటాలు వేసి చెరోవాటాకు రెండేసి లక్షలు వస్తాయంది. తనకి విడిగా ఏమీ అక్కరలేదంది.

పరంధామయ్య విరక్తిగా నవ్వుకున్నాడు. తేరగా వచ్చే డబ్బు ఎంత పాపిష్టిది! అభిమానాలను, తోడబుట్టిన వారి మధ్యన ఆత్మీయతను ఎలా నాశనం చేస్తుందో అని విచారించేడు.

మరో రెండురోజుల తరువాత ఆ లాటరీ కుర్రాడు మళ్ళీ పరుగెత్తుకొనివచ్చేడు.

రెండు న్యూస్‌పేపర్లను తీసుకొచ్చి చూపించేడు. కర్నాటక లాటరీ బంపర్ బహుమతి టిక్కెట్టు నంబర్ తప్పుగా అంతకుముందు పేపర్లలో జెకె– 501647 అని పడ్డదని, దాని కరెక్టు నెంబర్ జెకె– 507647 అని వుంది.

దానితో అందరూ హతాశులై ఒకరి ముఖాలొకరు కోపంగా చూసుకొని వచ్చిన బంధువులు ఆ మరునాడే రైలెక్కేసేరు.

పరంధామయ్య మాత్రం హాయిగా గాలి పీల్చుకున్నాడు. 'యల్లభసే నిజకర్మో పాత్తం విత్తంతేన వినోదయ చిత్తమ్' అని అనుకున్నాడు.

*

## విచిత్రం!



1989లో ఒక స్త్రీ చనిపోతే ఆమె కొడుకు(బాంకాక్ నివాసి) దాన్ని తనింటనే సురక్షితంగా దాచాడు. అప్పుడు పొరుగింటాయన కోర్టుకి ఫిర్యాదు చేశాడు. ఆ శవాన్ని తొలగించాలని వారు ఆదేశించారు. ఫిర్యాదీ లెఫ్టినెంట్ కల్నల్ కథనానుసారం ఈ మహిళ భూతమై గత నాలుగు సంవత్సరాల నుండి ఈ కుటుంబాన్ని వేధిస్తోందట. రాత్రంతా కుక్క మొరవటం, మృత స్త్రీ తమ ఇంటిముందు నల్లని ఆకారంలో పచార్లు చేయటం, రోజూ తాను తనభార్య చూస్తున్నామని వివరించాడు. ఆ కొడుకుపైగా మృత్యు ప్రమాణ పత్రంలో తల్లి శరీరాన్ని ఒక బౌద్ధ విహారానికి అప్పగించానని అబద్ధం చెప్పాడట. మరి ఏమిటి అతని చోద్యం!

—అచ్యుతుని రాజ్యశ్రీ